## యూఏఈలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): యూఏఈలో ఉద్యోగాల కోసం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నది. మంగళవారం విజయనగర్‌కాలనీలోని ఐటీఐ మల్లేపల్లి క్యాంపస్ టామ్‌కామ్ ఆఫీస్‌లో అర్హులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. యూఏఈలోని సిరామిక్ క్యాస్టర్, ట్రైనీ క్యాస్టర్, జూనియర్ ప్రాసెస్ ఆపరేటర్ ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు తెలిపింది. వీటికి సంబంధిత విభాగంలో అర్హతతో పాటు 18 నుంచి 40 ఏండ్ల మధ్య ఉండాలని తెలిపింది. ఆసక్తి, అర్హత కలిగినవారు టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో రెజ్యూమ్ పంపాలని సూచించింది. మరిన్ని వివరాలకు 9440 049937,9440049861 నంబర్లను సంప్రదించాలని తెలిపింది.

## వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు సూచించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున వడదెబ్బ బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఎండల తీవ్రత, జాగ్రత్త చర్యలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. లేబర్ అడ్డాలు, పని ప్రదేశాలను గుర్తించి తాగునీరు అందుబాటులో ఉంచాలని, అన్ని బస్తీలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అదనంగా నిల్వ ఉండేలా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వైద్యఆరోగ్య, ఉపాధి, కార్మిక శాఖలు కార్యచరణ రూపొందించాలని సూచించారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు జర్నలిస్టు సంఘాల వినతి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే -టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట హెచ్‌యూజే ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్ మాట్లాడుతూ అక్రెడిటేషన్ కార్డుల గడువును మరోసారి పొడిగించకుండా కొత్త కార్డులను ఇవ్వాలన్నారు. ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. బీపీఎల్ కింద గుర్తించి జర్నలిస్ట్‌లకు న్యాయం చేయాలని కోరారు. ఆరోగ్య కార్డులు రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల్లో ఉన్నట్టు గా పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. జర్నలిస్ట్‌లపై దాడులను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దుండిగల్‌లో రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

మసీదు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

# రైతులకు అన్యాయం జరగకుండా కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, ఫిబ్రవరి 24: దుండిగల్ గ్రామ రైతులకు ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా కాపాడుకుంటమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ విప్ కేపీ వివేకానంద్ అన్నారు. గండి మైసమ్మ-దుండిగల్ మండలం, దుండిగల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 453, 454లోని చిన్న చెలక భూమిని స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వం సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురై దుండిగల్‌లోని వార్డు కార్యాలయం ఎదుట సోమవారం సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ రైతులు సాగు చేసుకొనే భూమిలో ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయడంపై సంబంధిత అధికారులతో చర్చిస్తామని, ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా కాపాడుకుంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. 50 ఏండ్ల క్రితమే సాగు కోసం నిరుపేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని చూస్తూ ఉందని, అయితే సర్వే నంబర్ 453, 454 భూములకు సంబంధించి చట్టపరంగా అందరం కలిసి రక్షించుకుందామని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ఒకటై పోరాడదామని అన్నారు. అనంతరం స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. సమస్య తీవ్రతపై తహసీల్దార్‌తో చర్చించారు. సర్వే నంబర్ 453, 454 లలోని భూములకు సంబంధించిన వివరాలు సేకరించి ఎట్టిపరిస్థితుల్లోనూ ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఎమ్మారోకు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుల పక్షాన పోరాడిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శంబీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, అమరం గోపాల్ రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**సర్వమత సారమే మానవ జీవన విధానం**

– సర్వమత సారమే మానవ జీవన విధానమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ విప్ , కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న మజీద్ ఈ మహబూబున్నీసా బేగం-మెహబూబా అక్తరీ మసీదుకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంబీపూర్ కృష్ణ, మైనార్టీ విభాగం నాయకులు మహమ్మద్ అలీ నాయర్, రహత్ అలీ, మహమ్మద్ నసీరుద్దీన్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు

## విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24: రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని సీఎంకు కమిషన్ తరపున నివేదిక అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ అధ్వర్యంలో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ప్రభత్వ విద్య పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా విద్యాహక్కు కల్పించకపోతే దళితులు చదువుకు దూరమయ్యేవారని అన్నారు. ప్రొఫెసర్ కె.లక్ష్మినారయణ మాట్లాడుతు మనువాద భావాజాలంవల్లనే విద్యకు బడ్జెట్ కేటాయించకుండా దళితులను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదివేల పాఠశాలలను మూసివేతకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బడ్జెట్ కేటాయించాలన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ విద్యారంగానికి 24- 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులు కేటాయించి తమ హామీని తామే తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబునాయక్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నాగరాజు, అనిల్, హరిష్, హైకోర్టు న్యాయవాదుల సాధిక్, దివాకర్, వివిధ సంఘాల నాయకులు మెట్ల శంకర్, మామిడి నారాయణ, నర్సింగరావు, జనార్దన్, ఘనందన్, కల్పన సువర్ణ, భాగ్య, రాజేందర్, ఎగొండ, సంజీవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం వద్దు

- అధికారులకు కమిషనర్ ఇలంబర్తి ఆదేశం
- ప్రజావాణిలో 194 ఫిర్యాదుల స్వీకరణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ ): సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయరాదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుంచి కమిషనర్ ఇలంబర్తి ఆర్జీలను స్వీకరించారు. పలు సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం దిశగా సూచించారు. ప్రజావాణిలో ఆయా విభాగాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుల జారీలో జాప్యం చేకుండా త్వరితగతిన కార్డులు జారీ చేయడంపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా విభాగాలకు సంబంధించిన ఆర్జీలను వేగవంతంగా పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు.

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 82 విన్నపాలు రాగా, అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి 46, శానిటేషన్ ఐదు, ట్యాక్స్, హెల్త్ విభాగాలకు నాలుగు, ఇంజనీరింగ్ మెయింటనెన్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు మూడు చొప్పున, ఎఫ్ఏ, ఎలక్ట్రికల్, ల్యాండ్ అక్విజిషన్, యుసిడి విభాగాలకు రెండు చొప్పున ఫిర్యాదు చేశారు. ఫోన్ ఇన్ ద్వారా ఆరు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 112 ఆర్జీలు అందాయని, అందులో కూకట్‌పల్లి జోన్‌లో 51, ఎల్బీనగర్ 13, శేరిలింగంపల్లి 12, సికింద్రాబాద్ 27, చార్మినార్ 8, ఖైరతాబాద్ జోన్‌లో ఒక ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి రావు, సీసీపీ శ్రీనివాస్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, సీఎంహెచ్ఓ పద్మజ, అడిషనల్ సీసీపీలు ప్రదీప్, గంగాధర్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించకుంటే చర్యలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఉద్యోగులు కార్యాలయ విధులకు హాజరుకావాలని, సమయపాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు నిర్దేశించిన సమయానికి కార్యాలయాలకు చేరుకోవాలన్నారు. సిబ్బంది సరైన సమయానికి విధులకు అవుతున్నారా? లేదా? అని పర్యవేక్షించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాలయాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, కార్యాలయ పని వేళల్లో విధుల్లో లేని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ప్రజావాణికి 386 దరఖాస్తులు

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి 386 దరఖాస్తులు అందాయని చెప్పారు. ఆర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 275 డబుల్ బెడ్రూం, 7 ఇందిరమ్మ ఇండ్లు, 51 పింఛన్లు, 33 ఇతర శాఖలకు చెందిన దరఖాస్తులు అందాయని తెలిపారు. వచ్చే వారంలోగా ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లేకుండా అధికారులు చూడాలని ఆదేశించారు.

## కీచక ఉపాధ్యాయుడు మాకొద్దు

వికారాబాద్, ఫిబ్రవరి 24 : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చ తెచ్చాడు. వికారాబాద్ మండల పరిధిలోని ధ్యాచారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులపై గత కొన్ని రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. పాఠశాలలో 4వ తరగతిలో 10 మంది, 5వ తరగతిలో 6గురు విద్యార్థినులపై చెయ్యి వేయడం, కడుపుపై గిల్లడం, అసభ్యంగా తాకుతున్నాడని విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. మూడు రోజుల క్రితం విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఆ ఉపాధ్యాయుడిపై మండిపడ్డారు. 16 మంది విద్యార్థినులు ఈ సార్ మాకొద్దు అంటూ హెచ్ఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను పిలిచి మరోసారి ఇలాంటివి చేయకూడదని మందలించారు. ఈ విషయం మండల విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆ సార్‌ను ధ్యాచారం పాఠశాల నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

# నిత్య పరిశోధకుడు నలిమెల భాస్కర్

సిటీ కాలేజీ మఖ్దూమ్ పురస్కార సభలో ఆచార్య వెలుదండ నిత్యానందరావు

మఖ్దూమ్ పురస్కారాన్ని అందజేసిన అనంతరం నలిమెల భాస్కర్ దంపతులను సత్కరిస్తున్న పలువురు ప్రముఖులు

చార్మినార్, ఫిబ్రవరి 24: ఆధునిక తెలుగు సాహిత్యంలో పరిశోధకుడిగా, బహుభాషావేత్తగా, అనువాదకుడిగా, రచయితగా విశేష కృషిచేసి డాక్టర్ నలిమెల భాస్కర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు. సిటీ కాలేజీ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార ప్రదాన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిత్యానందరావు మాట్లాడుతూ విభిన్న భాషాల్లో నిరంతరం కృషి చేస్తున్న నలిమెల భాస్కర్‌కు మఖ్దూమ్ పురస్కారం ప్రదానం చేయటం ఎంతో సముచితమైన నిర్ణయమని అన్నారు. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లోని సామెతల స్వరూప స్వభావాలను తులనాత్మకంగా విశ్లేషించటమే కాకుండా ప్రామాణిక గ్రంథాలను ప్రచురించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తెలంగాణ భాష ఔన్నత్యాన్ని తెలియజేయటం కోసం తెలంగాణ పదబంధ కోశం తయారుచేశారని కొనియాడారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో అభ్యుదయ సాహిత్యానికి కేంద్రబిందువుగా మఖ్దూమ్ వెలుగొందారని అన్నారు. సిటీ కాలేజీ మాజీ అధ్యాపకులు, కవి యాకూబ్ మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం గురించి మఖ్దూమ్ చూపిన బాటలో అందరం నడవాలని అభిప్రాయపడ్డరు. అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ నలిమెల భాస్కర్ పద్య కవిత్వంతో పాటు వచన సాహిత్యంలో కూడా మంచి ప్రతిభ కనబరిచారని, నవలలు కూడా రాశారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ సిటీ కాలేజీ పూర్వ అధ్యాపకుడైన మఖ్దూమ్ పేరుతో జాతీయ పురస్కారాన్ని 2019 నుంచి ప్రదానం చేస్తున్నామని, ఈ సంవత్సరం బహుభాషావేత్త నలిమెల భాస్కర్ గారికి అందించటం అవార్డు గౌరవాన్ని పెంచిందని అన్నారు. ఈ అవార్డు కింద పదివేలు నగదు బహుమతి, జ్ఞాపికను అందజేసి అతిథులు నలిమెల భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని అవార్డు కమిటీ కన్వీనర్ డా.విప్లవ్‌దత్‌శుక్లా, సభ్యులు డా.యాదయ్య, డా.కోయి కోటేశ్వరావులు సమన్వయం చేశారు. కార్యక్రమంలో కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ డా.వెల్చాల కొండలరావు, తెలంగాణ సాహిత్య అకాడెమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌లాల్, వాహేద్, కవయిత్రి విమల, కరీంనగర్ సాహితీ సోపతి మిత్రులు డా.బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, పొన్నం రవిచంద్ర, కందుకూరి అంజయ్య, కాలేజీ అధ్యాపకవర్గం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కుటుంబం, దేశాభివృద్ధి మహిళా సాధికారతతోనే సాధ్యమవుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24 నుండి 28 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ప్రగతి మెరుగుపడాలంటే ప్రతిఒక్కరు పొదుపును అలవర్చుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్ పలాని, జి.ముకుంద రెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఎల్డీఎం సుబ్రహ్మణ్యం, పరిశ్రమల కేంద్రం జీఏం పవన్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ వెంకటి, సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అధికారులు

## మార్చి 2న జలవిహార్ వద్ద ఎల్లో రిబ్బన్ రన్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 24: ఎండోమెట్రియోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఎండోమెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 2న నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ వద్ద ఎల్లో రిబ్బన్ రన్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ విమీ బింద్రా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమ పోస్టర్లు, టీషర్టు, పతకాలను ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సినీనటి, సామాజిక కార్యకర్త డాక్టర్ సాయికామాక్షి భాస్కర్ర, రన్ అంబాసిడర్ వివేక్‌గోయల్‌తో కలిసి ఆవిష్కరించారు. దేశంలో 4.2 కోట్లకు పైగా మహిళలు ఎండోమెట్రియాసిస్ బారిన పడ్డారని తెలిపారు. సరైన అవగాహన లేకనే సమస్య వస్తోందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకే 3, 5, 10కే విభాగాల్లో ఎల్లో రిబ్బన్ రన్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

పోస్టర్, టీషర్టు, పతకాలను ఆవిష్కరిస్తున్న కర్ణన్, డాక్టర్ విమీ బింద్రా, నటి డాక్టర్ కామాక్షి

## ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు తనిఖీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ సోమవారం నగరంలోని పలు ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఆర్ నగర్, బంజారాహిల్స్, ఎర్రగడ్డ ప్రాంతాల్లో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. ట్యాంకర్ బుకింగ్, డెలివరీ వివరాలు ఇన్‌చార్జీలతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆ ప్రాంతాల్లో సౌకర్యాల మెరుగుకోసం పలు పనుల్ని మంజూరు చేశారు. ఆయనతో పాటు జీఎం హరిశంకర్ పాల్గొన్నారు.

తనిఖీలో భాగంగా అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్

## పెంచిన పరీక్ష ఫీజులు తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: అశాస్త్రీయంగా పెంచిన పరీక్ష ఫీజులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఓయూ పరిపాలన భవనాన్ని సోమవారం ముట్టడించారు. ఆర్ట్స్ కళాశాల నుండి పరిపాలనా భవనం వరకు భారీర్యాలీ నిర్వహించి, పరిపాలన భవనం ముందు ధర్నా చేపట్టారు. విద్యార్థులు వర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా నినదించారు. అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీ తేజ మాట్లాడుతూ ఓయూ పరిధిలో పరీక్ష ఫీజులను విచ్చలవిడిగా పెంచి విద్యార్థుల దగ్గర బలవంతంగా వసూలు చేయడానికి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో లేనంతగా పరీక్ష ఫీజులు వందేళ్ళ ఓయూలో ఉండడం సరి కాదన్నారు. పేరుకే ప్రభుత్వ వర్సిటీలని, ఫీజులు మాత్రం ప్రైవేటును తలదన్నే రీతిలో ఉన్నాయని దుయ్యబట్టారు. విద్యార్థుల పక్షాన పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు ఝాన్సీ, అలివేలి రాజు, హరిప్రసాద్, దృహన్, శివశంకర్, శ్రీనాథ్ శ్యామ్, సూర్యప్రకాష్, భరత్, పూజిత్, మహేష్, కృష్ణ, విక్రమ్, బాలకృష్ణ, నాగేష్, అఖిల్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

## పోస్టల్ ప్రైవేటీకరించే కేంద్రం కుట్రలను అడ్డుకోవాలి

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 24: పోస్టల్ వ్యవస్థను రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ కుట్రలను అడ్డుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జరగనున్న అఖిలభారత తపాల ఉద్యోగుల సంఘం పోస్ట్ మాన్, ఎంటీఎస్ రాష్ట్ర 4వ ద్వైవార్షిక మహాసభలు అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ హాలులో సోమవారం ప్రారంభమయ్యాయి. సర్కిల్ అధ్యక్షుడు సీహెచ్ కుమార్ అధ్యక్షతన జరిగిన మహాసభలకు ఏఐపీఈయూ నాయకులు ఆర్పీ సారంగ్‌ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ పోస్టల్ బిల్లులను రద్దు చేయాలని, ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే యోచనను ఆయన వ్యతిరేకించారు. ఓపీఎస్ విధానాన్ని పున ప్రారంభించాలని ఇండిపెండెంట్ డెలివరీ సిస్టంను రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకించారు. పోస్టుమెన్ మీద అకౌంట్ల పేరుతో టార్గెట్ల పేరుతో ఇబ్బందికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. తపాల శాఖ ప్రైవేటీకరణ ఆలోచన విధానాన్ని తిప్పికొడుతూ మార్చి 3న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి ఎం.మధుసూదన్‌రావు, సర్కిల్ కోశాధికారి ఎ.రమేష్, సురేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎం.నగేష్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బోస్కా, జనరల్ సెక్రెటరీ అజీజ్, రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్‌కుమార్, కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ జలాలుద్దీన్, అడ్మిన్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ శ్రీకాంత్, అకౌంట్ సర్కిల్ సెక్రెటరీ సోమేశ్ సీనియర్ జర్నలిస్టు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న అఖిలభారత తపాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

## వాట్‌మోర్ క్రికెట్ శిక్షణకు విశేష స్పందన

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంతర్జాతీయ క్రికెట్‌లో మేటి జట్లకు కోచ్‌గా వ్యవహరించిన డేవ్ వాట్‌మోర్ క్రికెట్ శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించింది. క్రిమ్సన్ స్పోర్ట్స్ అకాడమీ, క్రికింగ్‌డమ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణలో యువ క్రికెటర్లకు విలువైన సూచనలు అందజేశారు.